విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 19, నవంబర్ 2024

కమిషనర్ ఆర్డర్ లెక్కచేయని ఈవో

విశాలాంధ్ర - చాగలమర్రి : మబేతంచెర్ల మండలం ఆర్ ఎస్ రంగాపురం గ్రామంలోని మదిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఈవో అడిషనల్ కమిషనర్ ఆర్డర్‌ను లెక్క చేయడం లేదని చాగలమర్రి పట్టణానికి చెందిన వేలంపాటదారులు కెవిఎస్ ఎంటర్ప్రైజెస్ ప్రొప్రైటర్ రామాంజనేయులు ఆరోపించారు. సోమవారం ముత్యాలపాడు బస్టాండ్ లోని నోబెల్ టాకీస్ ఆవరణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అక్టోబర్ నెల 15వ తేదీన ఘన మదిలేటి నరసింహస్వామి దేవాలయంలో తలనీలాల వేలం పాటలు నిర్వహించారన్నారు. ఈ వేలం పాటలకు హైదరాబాదు నుండి కళావతి ఎంటర్ప్రైజెస్, హిందూపురం నుండి రాజా ఎంటర్ప్రైజెస్, అద్దంకి నుండి ఒకరు, చాగలమర్రి నుండి కేవిఎస్ ఎంటర్ప్రైజెస్ నలుగురు బహిరంగ వేలం పాటల్లో పాల్గొన్నారన్నారు. ఈవో రామాంజనేయులు గత ఏడాది కంటే తక్కువ వేలం పాటలు పాడితే వాటిని రద్దుచేసి మరలా వేలం పాటలు నిర్వహిస్తామన్నారు. బహిరంగంగా సీల్డ్ కవర్లో ప్రొద్దుటూరు చెందిన మజ్జే ఎంటర్ప్రైజెస్ వారికి టెండర్ను ఇచ్చారన్నారు. ఈ విషయంపై టెండర్దారులు కమిషనర్ వద్దకు వెళ్లి జరిగిన విషయం వివరించగా ఆయన స్పందించి తిరిగి టెండర్లు నిర్వహించాలని ఆర్డర్ ఇచ్చారన్నారు. ఈవో రామాంజనేయులు మాత్రం కమిషనర్ ఆర్డర్ను లెక్కచేయకుండా ప్రొద్దుటూరుకు సంబంధించిన మజ్జే ఎంటర్ప్రైజెస్ వారికి తలనీలాలు అందజేస్తున్నారని ఆరోపించారు. ఇదేమిటని తాము నిలదీయగా ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారమే నడుచుకుంటున్నామని తిరిగి టెండర్లను పిలుస్తామని చెబుతున్నారు తప్ప ఇంత వరకు పిలవలేదని ఆయన తెలిపారు. తలనీలాలు మాత్రం యధావిధిగా ప్రొద్దుటూరు వారికి అందజేస్తున్నారు. గత ఏడాది తలనీలాలు రూ 1.85 కోట్లు పలుకగా ఈ ఏడాది సుమారు రెండు కోట్ల వరకు వేలంపాటలో రావచ్చని వారు తెలుపుతున్నారు. ఈవో నిర్లక్ష్య ధోరణి కారణంగా ప్రభుత్వానికి రావలసిన ఆదాయము గండిపడుతుందని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి అనధికారికంగా తరలి వెళ్తున్న తలనీలాలను నిలువరించి తిరిగి టెండర్లు పిలిచి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచాల్సిందిగా కోరుతున్నారు.

రైతులు విద్యుత్ లైన్ పట్ల జాగ్రత్త వహించాలి

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల పరిధిలోని ఆయా గ్రామాలలో గల వ్యవసాయ రైతులు విద్యుత్ లైన్ల పట్ల తగిన జాగ్రత్తలు వహించి అప్రమత్తంగా ఉండాలని శిరివెళ్ల విద్యుత్ శాఖ అధికారులు పిలుపునిచ్చారు. ప్రస్తుతం రైతులు సాగుచేసిన వరి పంటను కోతకు సిద్ధం చేస్తున్నందున కటింగ్ మిషన్లకు (ఆర్వెస్టర్) విద్యుత్ తీగలు, విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల వల్ల ప్రమాదాలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యగా విద్యుత్ అధికారులకు తగిన సమాచారం అందించాలని సూచించారు. రహదారుల పొలాలగట్లు వెంబడి గాని పొలాలలో ఉన్న విద్యుత్తు లైన్లో గాని విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు విద్యుత్ మోటార్లు వాటికి సంబంధించిన కేబుల్ వైర్లు తదితర వాటి నుండి విద్యుత్ ప్రమాదాలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యగా విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. ట్రాన్స్ఫార్మర్లు ఆఫ్ చేసుకుని తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ సరఫరా సామాగ్రిని తొలగించుకోవాలని పేర్కొన్నారు. పొలాల్లో బోరు బావులు ఉన్నటువంటి రైతన్నలు ఎత్తైనటువంటి కట్టెలకు ఎర్రటి గుడ్డలు చుట్టి బావులు ఉన్నట్లుగా ముందస్తు సిగ్నల్స్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇటీవల కొన్ని ప్రాంతాలలో కోత మిషన్లకు విద్యుత్ తీగలు తగిలి పలువురు ప్రాణాలు కోల్పోయినందున మరియు గత ఏడాది వ్యవసాయ బావిలో కోత మిషన్ పడిపోయి హెల్పర్ మృతి చెందిన సంఘటనను దృష్టిలో ఉంచుకొని రైతన్నలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.

సచివాలయ ఉద్యోగులకు అటెండెన్స్ ఆధారంగానే జీతభత్యాలు

జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయ ఉద్యోగులకు ఫేషియల్ రికగ్నిషన్ బేస్డ్ అటెండెన్స్ ఆధారంగానే జీతాల చెల్లింపుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ, ఎంపీడీవోలను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని పీజిఆర్ఎస్ హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా అధికారులతో పలు అభివృద్ధి అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహిం చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ సచివాలయ పరిధిలోని ప్రజలకు పారదర్శ కంగా, సమర్ధవంతంగా, నిర్ణీత కాల పరిమితిలోగా సర్వీసులు అందించే నేపథ్యంలో వారికి ఫేషియల్ రికగ్నిషన్ బేస్డ్ అటెండెన్స్ ఆధారంగానే జీతాల చెల్లింపుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్యాండ్ మేనేజ్మెంట్, ఎన్పీసీఐ యాక్టివేషన్, అపార్ ఐడి జనరేషన్, హౌస్ హోల్డ్ ఇమేజ్ జియో ట్యాగింగ్ సర్వే తదితర పారామీటర్లలో వెనకబడి వున్నారని పనితీరు మెరుగుపరుచుకుని నిర్దేశించిన లక్ష్య సాధనపై ప్రత్యేక దృష్టి సారించి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీలు, జడ్పీటీసీలు అడిగిన ప్రశ్నలకు అర్థవంతమైన సమాధానాలతో నివేదికలు అందజేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈనెల 21న నిర్వహించే కిషోర్ వికాస బాలికల జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమంలో మండల స్థాయి ట్రైనర్లు పాల్గొని తద్వారా గ్రామ స్థాయిలో అవగాహన కల్పించేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.

పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చేవరకు పోరు ఆగదు

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు
సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు

విశాలాంధ్ర - డోన్ : పేదలకు పట్టణంలో 2 సెంట్లు స్థలం, గ్రామాలలో 3 సెంట్లు స్థలం, ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ,వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితుల పిలుపుమేరకు నంద్యాల జిల్లా డోన్ మండ లంలో గ్రామ వార్డు సచివాలయం ముందు ఇల్లు లేని పేదలకు పట్టణంలో రెండు సెంట్లు, గ్రామాలలో మూడు సెంటు స్థలమిచ్చి ఇంటి నిర్మాణం కోసం ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు,జిల్లా కార్యవర్గ సభ్యులు,డోన్ మున్సిపల్ కౌన్సిలర్ పి.సుంకయ్య సీపీఐ మండల కార్యదర్శి బి.నారాయణ, మండల సహాయ కార్యదర్శి వరదరాజులు,డోన్ పట్టణ కార్యదర్శి మోట రాముడు,సహాయ కార్యదర్శి రామ్మోహన్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం డోన్ పట్టణంలో చిగరమానుపేట 10 సచివాలయం శ్రీరామ్ నగర్, వైఎస్ నగర్ ,సుందర్ సింగ్ కాలనీ, టీచర్స్ కాలనీ 12,13 సచివాలయం,కొండపేట 7 సచివాలయం,శ్రీనివాస్ నగర్ 1వ సచివాలయం,అలాగే గ్రామాలలో ఎద్దు పెంట, చనుగొండ్ల, దేవరబండ ,రామదుర్గం ,మిద్దపల్లి తాడూరు,యాపదిన్నె,ఓబులాపురం,సీసం గుంతల మల్యాల,దొరపల్లె మల్లంపల్లె తిమ్మాపురం ,కామగాని కుంట్ల,కమలాపురం, కన్నపకుంట, ఉడుములపాడు ఇండ్లు లేని నిరుపేదలు లబ్ధిదారులతో సచివాలయ అధికారులకు అర్జీలు సమర్పించి, ధర్నాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కె.రామాంజనేయులు,పి.సుంకయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు ఎన్నికల బహిరంగ సభలో ఎన్డీఏ ప్రభుత్వ అధికారంలోకి వస్తే గ్రామాల్లో,పట్టణాల్లో జగన్ ప్రభుత్వంలో జగనన్న కాలనీల పేరుతో ఒక సెంటు స్థలంలో 1,80,000 మంజూరు చేసి బాత్రూం అంత కూడా ఇల్లు లేదని నివాసానికి పనికిరాదన్నరన్నారు. మేము అధికారంలోకి వస్తే పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు స్థలం, గ్రామాల్లో మూడు సెంట్ల స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణాలకు ఐదు లక్షల రూపాయలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పటికీ ఓట్లు వేయించుకొని గెలిచి పదవులు పొంది 5 నెలలు కావస్తున్న ఒక్కరికి కూడా స్థలాలు పంపిణీ చేయలేదన్నారు. పూర్తిగా సూపర్ సిక్స్ పథకాలను పక్కకు పెట్టి తిరుపతి లడ్డులో కల్తీ ఉందని చంద్రబాబు నాయుడు సనాతన ధర్మమే ఆంధ్రప్రదేశ్ శ్రీరామరక్ష అని పవన్ కళ్యాణ్ మాయమాటలు చెప్పి ప్రజా సమస్యల పరిష్కారం చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. అంతేకాక ఉచితంగా ప్రజలకు ఇసుక పంపిణీ చేస్తామని ఇంటి నిర్మాణానికి సిమెంటు, కడ్డీ,ఎలక్ట్రిక్ అన్ని సరసమైన ధరలకు అందిస్తామని ధరలు తగ్గిస్తామని నేడు వాటిని పట్టించుకోకుండా పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని వారు ఆగ్రహించారు. ఇప్పటికైనా వెంటనే ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు పరిష్కారం చేయకపోతే నేడు సచివాలయం దగ్గర శాంతియుతంగా అర్జీలు ప్రజలతో సమర్పిస్తున్నామని,పరిష్కారం కాకపోతే అవసరమైతే ఎమ్మెల్యేల ఇంటిముందు ప్రజలతోనా అర్జీల సమర్పణ ధర్నాలు నిర్వహించాల్సి వస్తుందని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సమైక్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సెమిం బేగం, చిగురమాని పే ట శాఖా కార్యదర్శి జి .అబ్బాస్, దళిత కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి ప్రభాకర్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు రణత్ యాదవ్, మహిళా సమైక్య లోన్ కార్యదర్శి లక్ష్మీదేవి, వైయస్ నగర్ శాఖ కార్యదర్శి వెంకటేశ్వర్లు, శ్రీరాంనగర్ శాఖ కార్యదర్శి బాలముద్దయ్య, కొండపేట శాఖ కార్యదర్శి మద్దయ్య, ఎద్దు పెంట శాఖ కార్యదర్శి ఎర్రి స్వామి, సీసంగుంతల శాఖ కార్యదర్శి కొమ్ము మనోహర్, దొరపల్లె శాఖ కార్యదర్శి కొండయ్య, దేవరబండ ఆంజనేయులు గౌడ్, మిద్దేపల్లి శాఖ కార్యదర్శి పెద్దయ్య, చనుగొండ్ల శాఖ కార్యదర్శి కేశన్న, రామదుర్గం శాఖా కార్యదర్శి సుంకన్న, తిమ్మాపురం శాఖ కార్యదర్శి సురేష్, ప్రభాకరు, ఇంద్రాం పల్లె శాఖ కార్యదర్శి చంద్రబోస్,ప్రజాసంఘాల నాయకులు మహిళా సమైక్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్ : సీపీఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా సోమవారం నంద్యాల పట్టణంలోని సచివాలయాల దగ్గర ఇల్లు లేని నిరుపేదలకు పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్లు,గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు ఇంటి స్థలం ఇచ్చి,ఇల్లు నిర్మించేందుకు రూ.5లక్షలు హౌసింగ్ లోన్లు ఇవ్వాలని ఇల్లు లేని వారితో వ్యక్తిగత అర్జీలు అందజేశారు. ఈసందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు, సిపిఐ పట్టణ కార్యదర్శి కే ప్రసాద్‌లు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా 32 లక్షల మందికి ఇంటి స్థలాలు ఇచ్చి, పక్కా ఇల్లు నిర్మించేందుకు 1,80,000/ఇస్తానని చెప్పి నివాసాలకు అనుగుణంగా లేని ప్రాంతాలలో స్థలాలు కేటాయించడం వల్ల ఇప్పటికి ఆప్రాంతలలో నివాస స్థలాలు ఏర్పాటు చేసుకోలేదన్నారు. ఇప్పుడు వచ్చిన రాష్ట్ర కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీల అమలులో భాగంగా పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు నివాసయోగ్యంగా ఉండే స్థలాలు ఇచ్చి, ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు హౌసింగ్ లోన్లు ఇవ్వాలని అన్నారు. ప్రస్తుతం ఇంటి నిర్మాణానికి అవసరమైన ముడి సరుకులు స్టీల్, ఇసుక, కంకర, సిమెంటు ధరలు ఇలా ఆకాశానికి అంటుతున్నాయన్నారు. కనుక రాష్ట్ర ప్రభుత్వము పట్టణానికి దగ్గరలోనే పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చి, ఇంటి నిర్మాణానికి రుణాలు ఇవ్వాలన్నారు. పట్టణంలోని ముల్లన్ పేట సచివాలయంలో ఏఐటియుసి పట్టణ కార్యదర్శి డి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో వ్యక్తిగత అర్జీలు ఇవ్వడం జరిగింది. ఆదర్శనగర్ సచివాలయంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయ్ ఆధ్వర్యంలో వ్యక్తిగత అర్జీలను ఇవ్వడం జరిగింది. సలీం నగర్ సచివాలయంలో ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షులు భూమని శ్రీనివాసులు ఆధ్వర్యంలో వ్యక్తిగత అర్జీలు ఇవ్వడం జరిగింది. నందమూరి నగర్ సచివాలయంలో శాఖ కార్యదర్శి హుస్సేన్సా ఆధ్వర్యంలో వ్యక్తిగత అర్జీలను ఇవ్వడం జరిగింది. బైటిపేట సచివాలయంలో సిపిఐ శాఖ కార్యదర్శి సహాయ కార్యదర్శి సాల మద్దిలేటి, మద్దయ్య ఆధ్వర్యంలో వ్యక్తిగత అర్జీలను ఇవ్వడం జరిగింది. నడిగడ్డ సచివాలయంలో శాఖ కార్యదర్శి దప్పు ఖలీల్ ఆధ్వర్యంలో వ్యక్తిగత అర్జీలను ఇవ్వడం జరిగింది. చాంద్ బాడ సచివాలయంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ ఆధ్వర్యంలో వ్యక్తిగత అర్జీలను ఇవ్వడం జరిగింది వైయస్సార్ నగర్ సచివాలయంలో నాయక్ ఆధ్వర్యంలో వ్యక్తిగత అర్జీలను అందజేశామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు. నారాయణమ్మ చాంద్ బాషా మా భాష టెంకాయల భాష ఈశ్వర్ కళ్యాణ్ దానెల్ నాగరాజు సుబ్బరాయుడు కాశీం తోపాటు ఇల్లు లేని పేదలు పాల్గొన్నారు.

నూతన ఈవోగా ఎస్.ఎస్ ఆజాద్

విశాలాంధ్ర - శ్రీశైలం : ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీశైలం మహా క్షేత్ర నూతన ఈవోగా ఎస్ ఎస్ ఆజాద్ సోమవారం నాడు బాధ్యతలు స్వీకరించారు. ఈవో మాట్లాడుతూ శ్రీశైలం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని తిరుమల తిరుపతి తరహాలో శ్రీశైల క్షేత్రాన్ని అభివృద్ధి ధర్మ ప్రచారము, భక్తులకు ఎటువంటి ఇబ్బందేలే కలకుండా అన్ని సౌకర్యాలు స్వామి అమ్మ వాళ్ళ నిత్య కైంకర్యాలు ఆయా పూజలు సక్రమంగా జరిగేలాగా కృషి చేస్తానని తెలిపారు తమకు ఈవోగా స్వామివారి సేవ చేసుకునేందుకు అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి దేవాదాయ శాఖ మంత్రికి స్థానిక ఎమ్మెల్యేకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్లాస్టిక్ నియంత్రణకు విద్యార్థులు సహకరించాలి

విశాలాంధ్ర - బనగానపల్లె : పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ నియంత్రణకు విద్యార్థులు సహకరించాలని ఆర్ అండ్ బి శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సతీమణి బిసి ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. బనగానపల్లె పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ పక్కన గల కే జి ఆర్ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ ఇంద్రారెడ్డి విద్యార్థిని, విద్యార్థులతో మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువుల వాడకంతో పర్యావరణానికి జరిగే అనర్థాలు వివరించి, సంక్రాంతి లోపల పట్టణంలో ప్లాస్టిక్ నిషేధం గురించి వివరించారు. నంద్యాల జిల్లా వాణిజ్య విభాగ చైర్మన్ టంగుటూరి సీనయ్య, కళాశాల చైర్మన్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రులు ప్లాస్టిక్ నిషేధం గురించి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా వాణిజ్య విభాగ్యం చైర్మన్ టంగుటూరి సీనయ్య, జూనియర్ కళాశాల చైర్మన్ రామచంద్రారెడ్డి, నాగరాజు, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు,విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీ

విశాలాంధ్ర - కోవెలకుంట్ల : 57వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా కోవెలకుంట్ల పట్టణంలోని సోమవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గ్రంథాలయ ఆవశ్యకత గురించి వ్యాసరచన పోటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రంథాలయ అధికారి బాల తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి మాట్లాడుతూ విద్యార్థులు ఈ పోటీలో మొదటి బహుమతి రెండో బహుమతి విజేతలకు పొందిన వారికి ఈనెల 20న వారికి బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి తెలుగు పండిట్ సురేష్, మద్దిలేటి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధార్ అప్డేట్ ప్రత్యేక శిబిరం

విశాలాంధ్ర - రుద్రవరం : ఆధార్ కార్డులను అప్డేట్ చేసుకొనుటకు ఈనెల 19 నుండి 22 వరకు నాలుగు రోజులు ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఎంపీడీవో భాగ్యలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె తెలిపిన వివరాల మేరకు 2010 నుండి 2016 వరకు ప్రభుత్వము జారీ చేసిన ఆధార్ కార్డులకు ఎలాంటి ఆధారాలు లేకుండా జారీ చేయడం జరిగిందన్నారు. అలాంటి ఆధార్ కార్డులు కలిగిన ప్రతి ఒక్కరు వాటిని మార్చుకునేందుకు ప్రభుత్వ రుసుముగా 50 రూపాయలు చెల్లించి అప్డేట్ చేసుకోవాలన్నారు. ఆధార్ కార్డులలో పేరు, ఇంటిపేరు, ఇతరత్రా చేర్పు మార్పులకు వీలు కల్పించడం జరుగుతుందన్నారు. ఆధార్ కార్డులను అప్డేట్ చేసుకొనకపోతే అలాంటి కార్డులను రద్దు చేయడమే కాక ప్రభుత్వం తరపున అందించే పథకాలను రద్దు చేస్తూ బ్యాంకు సేవలను రద్దు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటర్ కార్డు కానీ, బ్యాంకు పుస్తకాలను ఆధార్ క్యాంపు ల వద్దకు తీసుకువస్తే మార్పులు చేర్పులు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆమె తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర - అవుకు : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా 5వ రోజు పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించినట్లు గ్రంథాలయ ఇన్చార్జ్ అధికారి పి.రామదాసు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర,బాలికలు ఉన్నత పాఠశాలలో వ్యాసరచన,చిత్రలేఖనం, క్విజ్,పరుగు పందెం మొదలగు పోటీలను నిర్వహించామని అన్నారు. గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు ఈ నెల 20న తేదీన బహుమతులను ప్రధానం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చెన్నకేశ్వరి,ఉపాధ్యాయులు సుమలత, కుమారి, సుబ్బలక్ష్మి ,ద్రాక్షాయిని,రాధిక,వాసు తదితరులు పాల్గొన్నారు.

గనిలో పడి కార్మికుడు మృతి

విశాలాంధ్ర- ప్యాపిలి : మండల పరిధిలోని సోమవారం హుసేనాపురం గ్రామానికి చెందిన కురువ శివుడు వయసు 54చందపల్లి గనిలో బండరాయపడి అక్కడక్కడ మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. హుసేనాపురం గ్రామానికి చెందిన కురువ శివుడు చండపల్లి గనులలో రోజు కూలికి వెళ్లేవాడు అయితే గనులలో పనిచేస్తుండగా ఆయనపై బండరాయి పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య కుమారుడు, కూతురు ఉన్నారు. గనిలో ఘాతాలు పెట్టడం వల్ల ఈ సంఘటన జరిగింది. దీనికిసంబంధిత అధికారులు విచారణ చేసి మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

రైతులు సహజ పంటలు పండించాలి

విశాలాంధ్ర - డోన్ రూరల్: రైతులు సహజ ఎరువులను ఉపయోగించి పంటలు పండించాలని తాహసిల్దార్ నాగమణి అన్నారు. ఓబులాపురం, దేవరబండ కు చెందిన పలువురు రైతులు సహజ ఎరువులను ఉపయోగించి పండించిన కూరగాయలు, ఆకుకూరలను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులు విక్రయించారు. తహశీల్దార్ నాగమణి మాట్లాడుతూ ఆరోగ్యానికి హానికరమైన కృత్రిమ ఎరువులను ఉపయోగించకుండ సహజమైన ఎరువులను వాడి పంటలను పండించినప్పుడు మార్కెట్ లో వాటికి తగిన మద్దతు ధర కూడా ఉంటుందని తెలిపారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

మెగా డీఎస్సీ విడుదల చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలం

నిరుద్యోగుల కడుపు కొడితే ఊరుకోం..ఉద్యమాలకు సిద్ధం అవుతాం
ఏఐవైఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాముడు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : మెగా డీఎస్సీ విడుదల చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని నిరుద్యోగుల కడుపు కొడితే ఊరుకోమని ఉద్యమాలకు సిద్ధమవుతామని ఏఐవైఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాముడు హెచ్చరించారు. ఆళ్లగడ్డ పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ నాయకులు మధు అధ్యక్షతన నియోజకవర్గ నూతన కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిదులుగా ఏఐవైఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాముడు, సిపిఐ ఆళ్లగడ్డ తాలూకా కార్యదర్శి భాస్కర్ లు పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఆళ్లగడ్డ నియోజకవర్గ ఏఐవైఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులతో పాటు 5 మందితో నూతన కమిటీని నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాముడు ప్రకటించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ ముఖ్య నాయకుల సమావేశంలో నాగరాముడు, భాస్కర్ మాట్లాడుతూ కూటమీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఖాళీగా ఉన్నటువంటి ఉద్యోగాలను భర్తీ చేయడంలో ఘోరంగా విఫలం చెందిందని ఆరోపించారు. వివిధ శాఖలలో రాష్ట్రంలో అనేక ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ ఏమాత్రం ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయకుండా నిరుద్యోగుల కడుపు కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలో రాకముందు నారా లోకేష్ యువగలం పాదయాత్రలో యువతకు అనేక రకాల హామీలు ఇచ్చి ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్నటువంటి అన్ని రకాల పోస్టులను భర్తీ చేస్తామని హామీ ఇచ్చి నేడు వందరోజుల పాలన పూర్తయినటువంటి నేపథ్యంలో ఏ ఒక్క ఉద్యోగం నోటిఫికేషన్ విడుదల చేయకుండా నిరుద్యోగులను నట్టేట ముంచడం బావ్యం కాదని వారు హెచ్చరించారు. కావున కూటమి ప్రభుత్వం తక్షణమే ఆలోచన చేసి మెగా డీఎస్సీ ద్వారా రాష్ట్రంలో ఖాళీగా ఉన్నటువంటి అన్ని రకాల ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేసి ఉద్యోగాలు భర్తీ చేయాలని, ఆయా జిల్లాల్లో స్థానికంగా ప్రభుత్వ పరిశ్రమలు నెలకొల్పి స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఉద్యోగ అవకాశాలు కల్పించలేని పక్షంలో ప్రతి నిరుద్యోగికి నెలకు 5000 రూపాయలు నిరుద్యోగ భృతి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఉద్యోగాలు ఇవ్వకుండా నిరుద్యోగ భృతి ఇవ్వకుండా నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ప్రత్యక్ష ఉద్యమాలకు సిద్ధమవుతాని వారు హెచ్చరించారు.. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ ఆళ్లగడ్డ తాలూకా నాయకులు సురేష్, చంద్రబాబు, శేఖర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ ఆస్తులను కాపాడండి

జిల్లా కలెక్టర్ కు రాంపల్లి గ్రామస్థుల వినతి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : చాగలమర్రి మండలం రాంపల్లి గ్రామస్తులు సోమవారం రామాలయ దేవాలయాన్ని, దేవాలయ ఆస్తులను కాపాడండని జిల్లా కలెక్టర్ కు గ్రామస్థుల వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన కాటసాని రామిరెడ్డి అనే వ్యక్తి 8 సంవత్సరాలకు ముందు గ్రామంలో ఎవరికి తెలియకుండా గ్రామ ఖండంలోని పురాతన రామాలయాన్ని పడగొట్టడం జరిగిందని, ఇది గమనించిన గ్రామ ప్రజలు ఎందుకు పడగొడుతున్నావని నిలదీయగా అతను సరైన సమాధానం చెప్పకుండా పారిపోవడం జరిగిందన్నారు. కొంతకాలం తర్వాత రామిరెడ్డి తిరిగి వచ్చి రామాలయాన్ని నేను ఒక్కడినే కడతానని. మాయమాటలు చెబుతూ గ్రామాన్ని, గ్రామస్థులను, దేవుణ్ణి కుడా మోసం చేస్తున్నాడని వారు ఆరోపించారు. జిల్లా కలెక్టర్ న్యాయం చేయాలని వారు వినతిపత్రం అందజేశారు.

జియో కోఆర్డినేషన్ సర్వేను వెంటనే పూర్తి చేయండి

విశాలాంధ్ర - వెలుగోడు : వెలుగోడు మండలం ప్రజా పరిషత్ కార్యాలయం నందు ఎంపీడీవో మధుసూదన రెడ్డి, పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమావేశము ఏర్పాటు చేసారు. పలు అంశాలను వారితో చర్చించారు. బ్యాంక్ అకౌంట్ లేనివారు, అకౌంట్ ఉండి ఇనాక్టివ్ ఉన్న వారు 250 రూపాయలు చెల్లించి, పోస్టల్ సిబ్బంది రాఘవేంద్ర, కార్తీక్, సుధాకర్ లను సంప్రదిస్తే,వెంటనే అకౌంట్ ఓపెన్ చేస్తారని ,జియో కోఆర్డినేషన్ సర్వేను వెంటనే పూర్తి చేయాలని ,నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారికీ ఆధార్ నెంబర్ ను,బ్యాంక్ అకౌంట్ తో అనుసంధానం చేయాలని, అన్ని సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో నరసింహారెడ్డి పాల్గొన్నారు.

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 19, నవంబర్ 2024

ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలి : సీపీఐ

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరుతూ సీపీఐ ఆద్వర్యంలో బారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. సోమవారం సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ముందుగా సీఆర్ భవన్ నుండి కలెక్టరేట్ వరకు బారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వేలాది మంది బాధితులు, సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. ర్యాలీలో అగ్రబాగ ప్రజానాట్యమండలి దప్పు కళాకారుల దప్పుచప్పుళ్ళతో దద్దరిల్లింది. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని నినాదాలు చేశారు. ర్యాలీలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి గిడ్డయ్య, నగర కార్యదర్శి పీ రామకృష్ణారెడ్డి, ఏపీ రైతుసంఘం రాష్ట్రకార్యదర్శి కె జగన్నాధం, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్ లెనిన్‌బాబు, సీపీఐ జిల్లా సహాయకార్య దర్శి ఎస్ మునెప్ప, సీపీఐ నగర సహాయ కార్యదర్శులు జీ చంద్రశేఖర్, సీ మహేష్, శ్రీనివాసరావు, నగర కార్యవర్గ సభ్యులు కుమార్, ఈశ్వర్, నల్లన్న, బీసన్న, ఏఐవైఎఫ్ జిల్లా అద్యక్షులు శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అద్యక్షులు సోమన్న, సహాయ కార్యదర్శి శరత్, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అద్యక్షకార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణి, నగర అద్యక్షకార్యదర్శులు నాగేంద్రమ్మ, భారతి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, శివకుమార్, ఏఐటీయూసీ నగర అద్యక్షులు వెంకటేష్, నాయకులు రామాంజి, పురుషోత్తం, రేణుక, సీపీఐ ఓర్వకల్లు మండల కార్యదర్శి రమేష్, బాబయ్య,నగరంలోని శాఖా కార్యదర్శులు,వివిధ సంఘాల ప్రజాసంఘాల నాయకులు, పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు.అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రంను స్పెషల్ డిప్యూటి కలెక్టర్ చిరంజీవికి సమర్పించారు.

దద్దరిల్లిన కలెక్టరేట్

నివాస స్థలాలు ఇవ్వాలంటూ ముట్టడి

ఎన్నికల హామీని ప్రభుత్వం నిలుపుకోవాలి

* సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.రామచంద్రయ్య
* జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఎన్నికల ముందు పేదలకు నివాసస్థలం ఇస్తామన్న హామీని నిలుపుకోవాలని సీపీఐ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్యలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ, ఏపీ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర సమితు పిలుపు మేరకు సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి అధ్యక్షతన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అంతకు ముందు సీఆర్ భవన్ నుండి కలెక్టరేట్ వరకు వేలాది మంది పేదల, సీపీఐ ప్రజాసంఘాల నాయకులతో బారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నా నుద్దేశించి రామచంద్రయ్య మాట్లాడుతూ సాధారణ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎన్నికలల్లో ఇచ్చిన హామీని నిలుపు కోవాలన్నారు. గత వైసీపీ జగన్ ప్రభుత్వం జగన్న కాలనీల పేరుతో ఇచ్చిన స్థలాలు నివాసయోగ్యంగా లేని, వారు ఇచ్చే సెంటున్నర స్థలం ఏమూలకు సరిపోదని, తాము అధికారంలోకి వస్తే గ్రామీణ ప్రాంతంలో మూడుసెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు స్థలం ఇస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ నిలుపుకోవాలన్నారు. చంద్రబాబు నాయుడు ఉచితంగా ఇసుక ఇస్తానన్నా ఎక్కడ కూడా ఇసుక ఉచితంగా లభించడం లేదని, అధిక ధరలకు విక్రయించుకుంటున్నారని విమర్శించారు. విజయవాడ నుండి శ్రీశైలం వరకు సీ ప్లేయిన్ నడుపుతున్నానని గొప్పలు చెప్పుకుంటున్న చంద్రబాబు సీప్లెయిన్ ఎవరికి కావలని, పేదలకు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇవ్వాలన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి పోయాయని విమర్శించారు. మహిళలకు తల్లికి వందనం, ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తానన్న ఊసే లేదన్నారు. నీతి వంతమైన పాలన అందిస్తామన్న చంద్రబాబు నాయుడు ప్రస్తుతం గ్రామాల్లో మద్యం ఏరులై పారుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ప్రతిపక్షనేత జగన్ మోహన్‌రెడ్డి ప్రతిపక్ష హెూదా ఇస్తేనే అసెంబ్లీకి పోతానని అనడం దారుణమని, బయట నుండి ప్రెస్‌మీట్ పెట్టి ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరి కాదన్నారు. అసెంబ్లీలో ప్రభుత్వ ప్రజావ్యతిరేఖ విధా నాలను నిలదీయాలని సూచించారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్ల నివాస యోగ్యమైన స్థలం ఇచ్చేంత వరకు సీపీఐ ఆద్వర్యంలో పోరాటాలు ఉదృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన వాగ్ధానం నెరవేర్చాలన్నారు. పేదలకు ఇండ్లస్థలంతో పాటు ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు, ఉచిత ఇసుక, సిమెంట్, ఇనుము ఇవ్వాలని కోరారు. నగరంలో ప్రజాప్రతినిధులు, వారి అనుచరులు అక్రమంగా అక్రమించుకున్న ప్రభుత్వ భూములు స్వాదీనం చేసుకోవాలన్నారు. కర్నూలు కుడా పరిధిలో 279 అక్రమ వేంచర్లు ఉన్నట్లు తెలుస్తుందని, వాటినన్నింటిని స్వాదీనం చేసుకుని పేదప్రజలకు పంపిణీ చేయాలన్నారు. ఇంటి స్థలాల కోసం వేలాది మంది తరలి రావడంతో కలెక్టరేట్ కార్యాలయం నినాదాలతో దద్ద రిల్లింది. తమకు ఇంటిస్థలం ఇచ్చేంత వరకు ఉద్యమాలు చేస్తామని, పేదలు గత రెండేళ్లుగా గుడిసెలు వేసుకున్న స్థలంలో గుడిసెలు తొలగించాలని అటు రెవెన్యూ, ఇటు పోలీసుల ప్రయత్నాలు ఆపివేయాలన్నారు. పేదల గుడిసెల జోలికి వస్తే సహించేది లేదని, ఆందోళనలు మరింత ఉదృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. పెద్దఎత్తున మహిళలు, చంటిపిల్లలతో తరలి రావడంతో కలెక్టరేట్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కలెక్టరేట్ వద్ద బారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి వచ్చిన వినతిపత్రం తీసుకుని సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుని పోతానని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. ప్రజా నాట్య మండలి కళాకారుల, దప్పు చప్పుట్లు, కోలాటాలు, గేయాలు ప్రజల ను ఆలరించాయి. ఈ ఆందోళన కార్యక్రమంలో ఏపీ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాధం, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి ఎన్.లెనిన్‌బాబు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, సీపీఐ నగర సహాయ కార్య దర్శులు జి.చంద్రశేఖర్, సి.మహేష్, శ్రీనివాసరావు, నగర కార్యవర్గ సభ్యులు కుమార్, ఈశ్వర్, నల్లన్న, బీసన్న, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న, సహాయ కార్యదర్శి శరత్, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షకార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణి, నగర కార్యదర్శి భారతి, ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, శివకుమార్, ఏఐటీయూసీ నగర అధ్యక్షులు వెంకటేష్, నాయకులు రామాంజి, పురుషోత్తం, రేణుక, సీపీఐ ఓర్వకల్లు మండల కార్యదర్శి రమేష్, బాబయ్య, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

పత్తికొండ.. ఆదోని.. దేవనకొండ.. తుగ్గలి.. గోనెగండ్ల.. ఆస్పరి.. కౌతాళం.. ఆదోని రూరల్.. ఎమ్మిగనూరు.. కోడుమూరు.. ఆలూరు.. కోడుమూరు.. నందవరం.. హొళగుంద.. మద్దికెర.. వెల్దుర్తి.. ఓర్వకల్లు.. ఎమ్మిగనూరు..

49వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు: అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ 49 వ రాష్ట్ర మహాసభలు విజయనగరంలో నవంబర్ 27 నుంచి 30వ తేదీ వరకు జరుగుతున్న తరుణంలో ఎమ్మిగనూరు పట్టణంలో నందు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభల గోడ పత్రికలు విడుదల చేశారు. ఈ పోస్టర్ ఆవిష్కరణకు ముఖ్య అతిధిగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యస్ షాబీర్ భాష, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విజేంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని, బ్రిటిష్ పాలకులను ఈ దేశం నుంచి తరిమి కొట్టాలని లక్ష్యంతో, స్వాతంత్ర సంగ్రామ పోరాటంలో పాల్గొన్న ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని, 49వ రాష్ట్ర మహాసభలకు విజయనగరం వేదిక కానుందని తెలిపారు. విద్య ప్రైవేటీకరణ కార్పొరేటీకరణ కాషాయకరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి లోకం ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు రంగస్వామి, పట్టణ కార్యదర్శి అబ్దుల్ ఖాదర్, శంకర్, మోహన్, వీరేష్, రవి, సురేష్, సమీర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రాలయం మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు రాష్ట్ర మహాసభల పోస్టర్స్ విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యస్. షాబీర్ బాష, జిల్లా సహాయ కార్యదర్శి టి.థామస్, మండల నాయకులు వీరేష్, నవీన్, గోవింద్, అరుణాచారి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

జాప్యం లేకుండా గడువులోగా పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో -కర్నూలు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీలను జాప్యం లేకుండా గడువు లోపు నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులను కలెక్టర్ స్వీకరించారు.ఫిర్యాదుల స్వీకరణ అనం తరం కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారాలపై అధికారులతో సమీక్షించారు. వెబ్‌లో వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని ఆదేశించామని, అయినప్పటికీ ఇంకా 9 అర్జీలను రెవెన్యూ, పోలీస్, అటవీ శాఖ, చేనేత జౌళి శాఖ, రిజిస్ట్రేషన్, డిఎస్డిఓ , సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు చూడలేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సంబంధిత శాఖల లాగిన్ లలో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని కలెక్టర్ ఆదేశించారు. రీ ఓపెన్ కేసులు 25 పెండింగ్ లో ఉన్నాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని

వేదవతి నిర్మాణానికి నిధులు కేటాయించాలి

విశాలాంధ్ర - ఆలూరు : వేదవతి ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు 2024 -25 బడ్జెట్‌లో నిధులు కేటాయించి నిర్మాణాన్ని పూర్తి చేయాలని సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు భూపేష్ అన్నారు. మండల కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో వామపక్ష పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం సోమవారం జరిగింది. సీపీఐ(ఎం) మండల కార్యదర్శి షాకీర్ అధ్యక్షత జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు రాధా కృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పిగిరి లక్ష్మీనారాయణ, సీపీఐ (ఎమ్మెల్) నాయకులు బోయ మునిస్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తుమ్మలబిడి లక్ష్మన్న, సీపీఐ (ఎస్ఎస్) బాష, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు హనుమంతు పాల్గొన్నారు.

గుంతలను పూడ్చి ప్రమాదాల నుండి కాపాడాలి

విశాలాంధ్ర-పత్తికొండ: మండలంలోని పందికోనకు వెళ్లే ప్రధాన రహ దారికి ఇరువైపులా గుంతలను పూడ్చి ప్రమాదాల నుండి కాపాడాలని పందికోన గ్రామ ప్రజలు కోరారు. సోమవారం గ్రామ ప్రజలు ఆర్డిఓ భరత్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లా డుతూ ఆగస్టు నెలలో కురిసిన అధిక వర్షాలకు రోడ్డుకు ఇరువైపులా గుంతలు పడి ప్రమాదాలు చోటు చేసు కుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి గుంతలను పూడ్చి ప్రమాదాల బారి నుండి రక్షించాలని కోరారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి..

విశాలాంధ్ర - కౌతాళంరూరల్ : మండలం తుంగభద్ర నది తీర నదిచాగి గ్రామంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి చెందింది. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం ఉదయం గ్రామానికి చెందిన బింగేరి రామ వ్యవసాయ పనుల నిమిత్తం ఎద్దులను తీసుకెళ్లాడు. విద్యుత్ మోటార్లకు సరఫరా కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్ఫార్మర్ వద్ద ప్రమాదవశాత్తు ఎద్దు పోవడంతో విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు రైతు బాధను వ్యక్తం చేశాడు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రామ ఎద్దు మృతి చెందడంతో తీవ్ర నష్టం వాటిల్లింది.

పకడ్బందీగా పారిశుద్ధ్య పనులు

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : నగరంలో పారిశుద్ధ్య పనులను పకడ్బందీగా చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు సిబ్బందిని ఆదేశించారు. సోమవారం స్థానిక ఆర్.టి.సి. బస్టాండ్ రోడ్డు, పాత ఈద్గా, కల్లూరు రోడ్డు, తదితర ప్రాంతాల్లో పారి శుద్ధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. కాలువలలో మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని, చెత్తాచెదారం ఎప్పటికప్పుడు తొలగిం చాలని సూచించారు. అన్ని ప్రాంతాల్లో చిన్న, పెద్ద కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. అనంతరం కమి షనర్ ఉస్మానియా కళాశాలలో పర్యటించారు. కార్పొరేటర్లు యూనూ స్ బాష, జుబేర్ మైదానంలో పలు సమస్యలను కమిషనర్‌కు తెలి పారు. మైదానంలో పిచ్చి మొక్కలు తొలగించాలని, ప్రజలకు సౌకర్య వంతంగా ఉండేందుకు వాకింగ్ ట్రాక్ నిర్మించాలని కార్పొరేటర్లు కోరగా, కమిషనర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఆరోగ్యాధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్ రెడ్డిలు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

విశాలాంధ్ర - పెద్దకడబూరు: గ్రంథాలయ 57వ వారోత్సవాలలో భాగంగా సోమవారం గ్రంథాలయ అధికారిణి ఆశాజ్యోతి ఆధ్వర్యంలో ఆదర్శ పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖన, వ్యాసరచన పోటీలు నిర్వ హించారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ రంగన్న, ఉపా ధ్యాయులు రాఘవేంద్ర, రాజశేఖర్, అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీల నిర్వహణ

విశాలాంధ్ర - సి.బెళగల్ : 57వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థిని విద్యార్థులకు సోమవారం సి.బెళగల్ లోని గ్రంథా లయ భవనంలో వివిధ రకాల పోటీలను గ్రంథాలయ అధికారి వెంకటరమణ నిర్వహించారు. ఈవారోత్సవాలలో భాగంగా జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు ర్యాలీ అనంతరం చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఈ నెల 20వ తేదీన బహుమతుల ప్రధాన కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి స్థలము పరిశీలన

విశాలాంధ్ర - కృష్ణగిరి: పత్తికొండ ఎమ్మెల్యే సొంత గ్రామమైన కంబాలపాడు గ్రామంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ నిర్మించేందుకు స్థలం పరిశీలించినట్లు డోన్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ భారతి అన్నారు. సోమవారం మండల పరిధిలోని కంబాలపాడు జిల్లా పరిషత్ పాఠశాల ఎదురుగా ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 36 గ్రామాలు ఉన్నాయని, ఇంటర్మీడియట్ పూర్తి చేసిన తర్వాత ఉన్నత విద్య కొరకు సుదూర ప్రాంతాలకు వెళ్లలేక అమ్మాయిలు చదువు మానేసే పరిస్థితులు ఉన్నాయి. విద్యార్థులు డిగ్రీ విద్యను అభ్యసించేం దుకు డోన్, కర్నూలు తదితర ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి ఉంద న్నారు. ఈ నేపథ్యంలో పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు కృష్ణగిరి మండలానికి డిగ్రీ కాలేజ్ కావాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు అన్నారు. ముఖ్యమంత్రి స్పందించి హామీ ఇచ్చినట్లు తెలిపారు. స్థలం పరిశీలన నివేదికలను ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి పంపిస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వీరాచారి టీడీపీ నాయకులు నబిసాహెబ్, శ్రీరాములు, గురుస్వామి ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర - ఆదోని రూరల్: ట్రాఫిక్ నిబంధనలను ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ సిఐ ఘంటా సుబ్బారావు విద్యార్థులకు సూచించారు. సోమవారం పట్టణంలోని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ప్రిన్సిపల్ గౌసియా ఖానమ్,ఏవో అశోక్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండని విద్యార్థులు ద్విచక్ర వాహనాన్ని నడపరాదని, చట్ట విరుద్ధమని ప్రతి విద్యార్థులు గమనించాలన్నారు. ర్యాగింగ్, గంజాయి వంటి అసాం ఘిక కార్యకల్పాలకు పాల్పడి బంగారు జీవితాన్ని నాశనం చేసుకో వద్దని హెచ్చరించారు. విద్యను అభ్యసించే ప్రతి విద్యార్థి అత్యున్నత మైన లక్షన్ని లక్ష్యంతో చదువు పట్ల చురుకుగా ముందడు గులు వేయాలని చెప్పుకొచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించాలి

విశాలాంధ్ర - ఆదోని : రాష్ట్ర ప్రభుత్వం మదాసి కురువలకు అన్ని రంగాల్లో అవకాశం కల్పిస్తూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన ఎస్సీ రిజర్వేషన్ అమలు చేసేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని మాదాసి కురువ రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షుడు నాగరాజుగౌడ్ డిమాండ్ చేశారు. భక్త కనకదాసు జయంతిని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సందర్భంగా సోమవారం స్థానిక విక్టోరియా పేటలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద కనకదాసు చిత్రపటానికి పూలమాలవేసి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మాదాసి కురువ రాష్ట్ర కార్య అధ్యక్షుడు నాగరాజు గౌడ్ మాట్లాడుతూ కనకదాసు జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించి నందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పునందరీశ్వరి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, ఈరన్న, చౌడప్ప, కుబేర, రాజశేఖర్, ఉమా మహేష్ పాల్గొన్నారు.

విధులు బహిష్కరించాలని తీర్మాణం

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : కర్నూలు బార్ అసోసియేషన్ కార్యాలయంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బిఎస్ రవికాంత్ ప్రసాద్ ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ పి.రవి గువేరా హాజరైవర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థలు లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్, వక్ఫ్ బోర్డులను కర్నూలు నుండి అమరావతికి మారుస్తున్నారని, న్యాయవాదులు అధిక సంఖ్యలో మూడు రోజులపాటు విధులను బహిష్కరించాలని తీర్మాణం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు వై.జయరాజ్, ఎం.సుబ్బయ్య, ఓంకార్, నరసింహులు, కృష్ణమూర్తి, రామాంజులు, దస్తగిరి, శేషన్న, షఫీ, తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో..

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, మంగళవారం 19, నవంబర్ 2024

అట్టహాసంగా పొట్టేళ్ల పందెం.. విజేతలకు బహుమతులు అందజేత

విశాలాంధ్ర - పెద్దకడబూరు : కురువల ఆరాధ్య దైవం శ్రీ భక్త కనకదాసు జయంతిని పురస్కరించుకుని పెద్దకడబూరు గ్రామంలో కురువ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నల్లజాతి, నాటు పొట్టేళ్ల రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. పోటీలను మంత్రాలయం టీడీపీ ఇన్ చార్జ్ రాఘవేంద్రరెడ్డి సోదరుడు టీడీపీ యువనేత రామకృష్ణారెడ్డి, టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, బీసీ సాధికార రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లికార్జున, టీడీపీ నాయకులు ఏసేపు, మీ సేవ ఆంజనేయులు, తలారి అంజీ ప్రారంభించారు. ముందుగా శ్రీ భక్త కనకదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ భక్త కనకదాసు అడుగు జాడల్లో నడవాలని హితవు పలికారు. అనంతరం జరిగిన పొట్టేళ్ల పందెం పోటీలు జరిగాయి. నల్లజాతి పొట్టేళ్లు 30, నాటు పొట్టేళ్లు 14 పందెంలో పాల్గొన్నాయి. నాటు పొట్టేళ్లకు జరిగిన పందెంలో ప్రథమ స్థానంలో నిలిచిన అనంతరం జిల్లా, నేమలపల్లికి చెందిన లక్కి పొట్టేళుకు ఆదోనికి చెందిన డాక్టర్ వినీత్ కుమార్ రూ.20 వేలు అందజేశారు. రెండవ స్థానంలో నిలిచిన పెద్దకడబూరుకు దిట్టికాటి సిద్దప్పకు చెందిన పొట్టేళుకు పెద్దకడబూరు రేయిన్ బో ఇంగ్లీషు మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ గోవిందరెడ్డి రూ. 10 వేలు అందజేశారు. నల్లజాతి పొట్టేళ్లకు జరిగిన పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచిన వెంకటాపురం గ్రామానికి చెందిన రాయన్ గ్రూపు పొట్టేళుకు మంత్రాలయం టీడీపీ ఇన్ చార్జ్ రాఘవేంద్రరెడ్డి తరుపున సోదరుడు రామకృష్ణారెడ్డి రూ.20 వేలు అందజేశారు. రెండవ స్థానంలో నిలిచిన దొడ్డి బెళగల్ కు చెందిన వీరారెడ్డి పొట్టేళుకు నాగార్జున కంపెనీకి చెందిన రాఘవయ్య స్వామి రూ.10 వేలు అందజేయగా, మూడవ స్థానంలో నిలిచిన అనంతపురం జిల్లా ములకల పంటకు చెందిన మీసాల మామకు చెందిన పొట్టేళుకు బీసీ సాధికార రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లికార్జున రూ.5 వేలు అందజేశారు.

రాష్ట్ర బడ్జెట్ అభినందనీయం

విశాలాంధ్ర - చాగలమర్రి : రాష్ట్ర కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రాష్ట్ర బడ్జెట్ అభినందనీయమని టిడిపి జిల్లా బిసి సెల్ స్పోక్ పర్సన్ సల్లా నాగరాజు యాదవ్ పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయం నందు ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చాక రెండవ అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర అభివృద్ధికి, సంక్షేమానికి సంబంధించి అనేక విషయాలు చర్చించడం తోపాటు రాష్ట్ర బడ్జెట్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తయారు చేసి ప్రవేశపెట్టడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ఈ బడ్జెట్లో గ్రామాల అభివృద్ధి, పట్టణాల అభివృద్ధి, రాష్ట్ర ప్రజలకు అన్ని వర్గాలకు కావాల్సినటువంటి మౌలిక సదుపాయాలు, సంక్షేమం తో పాటు విద్య, వైద్యం, రోడ్లు, పేదలకు గృహ నిర్మాణాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, నిరుపేద అగ్రవర్ణాల వారికి కూడా ఈ బడ్జెట్ ఉపయోగపడేలా ఉందని, రాష్ట్ర అభివృద్ధికి చంద్రబాబునాయుడు గారు నిరంతర శ్రామికుడిలా పనిచేస్తున్నారు అని అన్నారు. నియోజకవర్గం లో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆధ్వర్యంలో ఇప్పటికే సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఆర్టీసీ లో ఉన్నటువంటి సమస్యలు తీర్చి కొత్త బస్సులను ప్రారంభించడం, బస్సు లేని ప్రాంతాలకు ప్రత్యేక చొరవతో బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవడం తో పాటు అనేక ప్రజా సమస్యలను తీర్చే దానికి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గారు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. కేవలం ప్రభుత్వం వచ్చిన అతి కొద్ది రోజుల్లోనే ఈ కార్యక్రమాలు చేపట్టడం గర్వకారణమన్నారు. టిఎన్టియుసి రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, టిడిపి నాయకులు వీరం రెడ్డి భాస్కర్ రెడ్డి, శంకర్ సుబ్బారావు, పీరయ్య, లక్ష్మీనారాయణ గౌడ్, సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, టైలర్ భాష బషీర్, బాల దస్తగిరి, కసినేని ఓబులేసు, కామిశెట్టి రమేష్, టైలర్ చోటు, వెంకటయ్య, చిన్న నరసింహారెడ్డి, రామతీర్థం, మోహన్శెట్టి, ప్రకాష్, రామసుబ్బయ్య, మోహన్ కృష్ణ, నరేంద్ర, రమణ, సుధాకర్ రెడ్డి, కృష్ణ నారాయణ, శ్రీకాంత్, ఇమామ్ భాష, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

సమానత్వాన్ని బోధించిన గొప్ప తత్వవేత్త భక్త కనకదాసు

విశాలాంధ్ర - జిల్లా పరిషత్ కర్నూలు: తన కీర్తనల ద్వారా భక్తి తత్వాన్ని, సామాజిక సమానత్వాన్ని బోధించిన గొప్ప తత్వ వేత్త శ్రీ భక్త కనకదాసు అని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష అన్నారు.. సోమవారం భక్త కనకదాసు జయంతోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, జిల్లా వెనుకబడిన తరగతుల సహకార సంఘం లిమిటెడ్ అధ్వర్యంలో బీసీ సంక్షేమ భవన్‌లో శ్రీ భక్త కనకదాసు విగ్రహానికి పూలమాలలు వేసి జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జిల్లాపరిషత్ మీటింగ్ హాల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బత్తిన వెంకట రాముడు, బీసీ సంఘం జనరల్ సెక్రెటరీ నక్కమిట్టల శ్రీనివాసులు, వివిధ కుల సంఘాల డైరెక్టర్లు, చైర్మన్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు

ఘనంగా కనకదాసు జయంతి వేడుకలు

విశాలాంధ్ర-ఆలూరు: మండలంలోని మొలగవల్లి గ్రామంలో స్థానిక ఆంజనేయ స్వామి దేవాలయంలో గ్రామ మదాసి మదారి కురువలు కలిసి భక్త కనకదాసు జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ముందుగా కనకదాసు చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా బీరప్ప డొల్ల వాయిద్యాలతో గొరవయ్య దమరుకనాథంతో గ్రామమంతా బండారమయంతో ముందుకు సాగారు. ఈ సందర్భంగా సంఘం సీనియర్ నాయకులు మాట్లాడుతూ సమాజం భక్తి భావం పెంపొందించి అందరికి ఆదర్శంగా నిలిచారన్నారు.కనకదాసు చూపిన మార్గంలో అందరూ నడవలన్నారు. కురువల సంక్షేమానికి పార్టీలకతీతంగా ప్రభుత్వాలు కట్టుబడి ఉండాలి అన్నారు. ఈ కార్యక్రమంలో మొలగవల్లి గ్రామ మదాసి,మదారి కురువ సంఘం నాయకులు, లక్ష్మిరెడ్డి, కురువ రామాంజనేయులు, చిన్ని ఈరన్న, శ్రీరాములు, లక్ష్మినారాయణ, హనుమప్ప, మాణిక్యరెడ్డి, మారెప్ప, వెంకటేశు, హరే రామ్, ఈరన్న, నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న కురువలు సంఘం నాయకులు హాజరయ్యారు.

గ్రూపులను సమన్వయంతో నిర్వహించాలి

విశాలాంధ్ర - సి.బెళగల్: మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో నిర్వహించుకుంటున్న పొదుపు గ్రూపులను మహిళలు సమన్వయంతో నిర్వహించు కోవాలని ఏటీఎం రమేష్ పొదుపు మహిళలకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీ శక్తి భవనంలో పొదుపు లక్ష్మి మహిళలతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ మహిళలు పొదుపులో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి అధిక వడ్డీ పడకుండా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రమేష్‌తో పాటు వెలుగు సీసీలు, ఆయా గ్రామాల పొదుపులకు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారిపై లైంగికదాడి బాధాకరం

విశాలాంధ్ర - చాగలమర్రి : చిన్నారిపై లైంగికదాడి జరగడం బాధాకరమని నంద్యాల జిల్లా విద్యాశాఖాధికారి జనార్ధనరెడ్డి అన్నారు. సోమవారం అత్యాచార యత్నం చోటుచేసుకున్న చాగలమర్రి పట్టణంలోని శ్రీ రాఘవేంద్ర పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా డిఈఓ మాట్లాడుతూ పాఠశాలలో చిన్నారిపై లైంగికదాడి జరగడం శోచనీయమన్నారు. విద్యార్థులు ఇలాంటి సంఘటనలకు పాల్పడి తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవడం సమంజసకరం కాదన్నారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులతో, చిన్నారి తల్లిదండ్రులతో పూర్తి స్థాయిలో విచారణ చేస్తామన్నారు. పోలీస్ అధికారులను కలిసి జరిగిన సంఘ టనపై వివరాలు తెలుసుకుంటా మన్నారు. ఈ సంఘటనకు పాల్పడిన విద్యా ర్థులను విచారిస్తామన్నారు. వాస్తవాలు తెలుసుకుని విద్యార్థులకు అన్యాయం జరగకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. చిన్నారిపై అత్యాచార యత్న సంఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి నివేదికలను జిల్లా కలెక్టర్‌కు, విద్యాశాఖ కమిషనర్‌కు అందజేస్తామన్నారు. మండల కేంద్రంలో ఇంత జరుగుతుండగా జిల్లా అధికారులు వచ్చే వరకు ఎంఈఓ పాఠశాల వైపు కన్నెత్తి చూడక పోవడం ఎంతో దారుణమని,పర్యవేక్షించాల్సిన అధికారులే ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు.ఇలాంటి అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిఈఓకు విద్యార్థి సంఘాలు పిర్యాదు చేశాయి. కార్యక్రమంలో ఎంఈఓలు అనురాధ, న్యాంతుల్లా, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

జిల్లా చదరంగం జట్ల ఎంపిక

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో సంజీవనగర్ లో ఉన్న శ్రీ రామకృష్ణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో 12 వేరు వేరు వయస్సు విభాగాలలో జిల్లా చదరంగం జట్ల ఎంపిక కోసం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవంలో జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని జ్ఞాపికలు, పతకాలు అందజేశారు. ఎంపికైన జట్లు డిసెంబర్ 12న నంద్యాలలో జరగనున్న రాష్ట్రస్థాయి చదరంగం పోటీలలో పాల్గొనుటకు అర్హత సాధించారు. డిసెంబర్ 12న నంద్యాలలో రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు నిర్వహిస్తున్నామని జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రవికృష్ణ, రామ సుబ్బా రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సీఎంఎస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మునిశేఖర్, టోర్నమెంట్ ఆర్గనైజర్ రాజా రమేష్ చక్రవర్తి, ఆర్బిటర్ సుజాత, మణి కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు ఓబులేసు, సుబ్బు, ప్రవీణ్ కుమార్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులు

విశాలాంధ్ర - అవుకు : పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు వృత్తి విద్యా కోర్సులలో భాగంగా విద్యుత్ సబ్‌స్టేషన్ సందర్శించినట్లు ప్రిన్సిపల్ హేమిమా తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు ఎలక్ట్రానిక్, హార్డ్వేర్‌కు సంబంధించిన విషయాలు, విద్యుత్ సరఫరాను విద్యుత్ ఏఈ పకీరయ్య వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మునీంద్ర ఉపాధ్యాయులు కె.రమణ, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రీమియంతో పంటలకు భీమా సౌకర్యం

విశాలాంధ్ర - రుద్రవరం : వ్యవసాయ రైతులు రబీ సీజన్లో సాగుచేసిన పంటలకు ప్రీమియం రుసుముతో బీమా సౌకర్యాన్ని పొందవచ్చని మండల వ్యవసాయాధికారి నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రబీ సీజన్లో రైతులు సాగు చేసిన శనగ పంటకు ఎకరాకు రూ.84, జొన్న పంటకు ఎకరాకు రూ.59, మినుము పంటకు ఎకరాకు రూ.48, వరి పంటకు రూ.126 ప్రీమియం రుసుము చెల్లించి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత బీమా పథకాలను పొందవచ్చు అన్నారు. ఈ పంటలకు డిసెంబర్ 15 లోగా ఆయా గ్రామాలలో ఉన్న రైతు సేవ కేంద్రాలలో ప్రీమియంను చెల్లించాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

యాగంటి ఉమామహేశ్వర స్వామికి పోటెత్తిన భక్తులు

విశాలాంధ్ర - బనగానపల్లె: మండల పరిధిలో ప్రముక సేవ క్షేత్రం అయినటువంటి యాగంటి ఉమామహేశ్వర స్వామికి భక్తులు పోటెత్తారు.కార్తీక మాసం మూడు సోమవారం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ముందుగా భక్తులు పుష్కరిని నందు స్థానం ఆచరించి ఉమామహేశ్వర స్వామి దర్శించుకున్న అనంతరం బసవన్న దర్శించుకున్నారు. కార్తీక సోమవారం సందర్భంగా ఆలయ ఈవో బి చంద్రుడు, బండి మౌలిశ్వర్ రెడ్డి పర్యవేక్షించారు.

ఆంజనేయ స్వామి దేవాలయం ప్రారంభం

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: మండల పరిధిలోని అమ కతాడు గ్రామంలో ఈనెల 20న నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి దేవాలయం ప్రారంభించి, ఆంజనేయస్వామి, ధ్వజస్తంభ, బొడ్రాయి, వాల్మీకి విగ్రహం ప్రతిష్టలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు హాజరవుతున్నట్లు తెలిపారు.

కార్తీక వనభోజనం మహోత్సవం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ: ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలోని లక్ష్మీ వనంలో కార్తీక వనభోజనం మహోత్సవ కార్యక్రమం సోమవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు ఉత్సవ మూర్తులైన ప్రహ్లాద వరద స్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ప్రత్యేక అలంకరణలో అహోబిల ఆలయం నుండి లక్ష్మీ వనానికి భారీ ఊరేగింపు మధ్య తీసుకొని వచ్చారు. అక్కడ మంటపంలో ఉత్సవ మూర్తులను ఆశీనులను చేసి పంచామృత అభిషేకం నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, టిడిపి ఆళ్లగడ్డ నియోజకవర్గ యువ నాయకుడు భూమా జగద్విఖ్యాత్ రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం కార్తీక వనభోజనాలను ఉసిరిక వనంలో వారే స్వయంగా భక్తులకు వడ్డించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 19 అర్జీలు

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : సోమవారం నగరపాలక కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ సమస్యలకు సంబంధించి ప్రజలు 19 అర్జీలు కమిషనర్ కు అందజేశారు.నగర వీధుల్లో నెలకొన్న చిన్నపాటి సమస్యలను జాప్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలని, ప్రజలు ఫిర్యాదు చేసేంత వరకు ఉండొద్దని నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు అధికారులను ఆదేశించారు. అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, మేనేజర్ ఎన్.చిన్నరాముడు, ఆరోగ్యధికారి కె.విశ్వేశ్వర్ రెడ్డి, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంఈ సత్యనారాయణ, ఆర్‌ఓ. జునైద్ పాల్గొన్నారు.

ఆశాజనకంగా వరి దిగుబడులు

విశాలాంధ్ర - వెలుగోడు : వెలుగోడు గ్రామంలో ఏవో పవన్ కుమార్ ఆధ్వర్యంలో వరి పొలంలో వంటకోత ప్రయోగాలను సోమవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పంట కోత ప్రయోగాలు మండలంలో జోరుగా కొనసాగుతున్నాయి. వరి సరాసరి దిగుబడి నిర్ధారణకు ప్రభుత్వం ఏటా ఈ ప్రయోగాలను కొనసాగిస్తోంది. వెలుగోడు రిజర్వాయర్ చెరువు లలో నీరు పుష్కలంగా ఉండడం, అలాగే భూగర్భ జలాలు అందుబాటులోకి రావడంతో బోర్లులో నీరు ఉబికి వస్తోంది. ఈఏడాది సాధారణ విస్తీర్ణం 8500 ఎకరాల్లో గాను, 8720 ఎకరాల్లో వరి సాగు చేశారు. వేసిన పంటలు చేతికి రావడంతో కోతలు మొదలయ్యాయి. వరి వంట నష్టపరిహారాలు చెల్లింపుకు, పంట దిగుబడులను పసిగట్టేందుకు ఈ ప్రయోగాలు ఉవయోగపడనున్నాయని ఏవో తెలిపారు. వెలుగోడు గ్రామంలోని రైతు తెలుగు శేషాద్రి సర్వే నంబర్ 117/1 వరి వంట 5/5 చదరపు మీటర్లు 16.92 కేజీలు దిగుబడి రాగా ఎకరానికి 37 బస్తాలు (75 కేజీల) దిగుబడిని అంచనా వేయడమైనది. ఏవో తో పాటు వ్యవసాయ విస్తరణ సిబ్బంది రామకృష్ణ, వెంకట శివ, నాగమణి, పసల బీమా ఏజెంట్ ఖలీల్ అహ్మద్, తలారులు, పలువురు రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యావంతులు గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - ఆదోని రూరల్: ప్రతి విద్యావంతుడు గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలని గ్రంథాలయ అధికారి సుజాత సూచించారు. సోమవారం గ్రంథాలయంలో ఐదవ రోజు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు కొనసాగాయి.ఆమె మాట్లాడుతూ అన్ని మతాలు అన్ని కులాలు ఉపయోగించే గ్రంథాలయాన్ని పౌర గంథాలయము అని తెలుపుతూ గ్రంథాలయం ఉపయోగించుకో వాలన్నారు. గ్రంథాలయ సభ్యత్వము రూ.100 లు వెచ్చించి లైఫ్ టైం నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రికార్డ్ అసిస్టెంట్ దేవేంద్ర, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల తెలుగు పండిట్ నల్లపరెడ్డి హాజరై ప్రసంగిం చారు. పోటీ వలన విద్యార్థుల్లో ఆలోచన శక్తి పెరగడమే కాకుండా సృజనాత్మక శక్తి మెరుగు పడుతుందని అభివర్ణించారు. విద్యార్థులకు సెల్ ఫోన్ వద్దు పుస్తకాలే ముద్దు అన్నారు. నెహ్రూ మెమోరియల్, మున్సిపల్ హై స్కూల్, బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొనని నిర్వహించిన కాంపిటీషన్ పోటీల్లో పాల్గొన్నారు. విద్యార్థులకు ప్రమాదక ద్రవం వలన కలుగు హానికరం పాటల పోటీలు దేశభక్తి గీతాలు నిర్వహించారు.

ఔషధ మొక్కలను ప్రకృతి మనకు ఇచ్చిన వరం

విశాలాంధ్ర-పాణ్యం: 63వ జాతీయ ఫార్మసీ వారోత్సవాలలో భాగంగా ఈరోజు శాంతిరాం ఫార్మసీ కళాశాలలో గ్రీన్ ఫార్మా ఎక్స్పో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల డీన్ డాక్టర్ అశోక్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పకృతి మనకు ఎన్నో ఔషధ గుణాలున్న వనరులను అందించిందని వాటి విలువలను మీరు ప్రజలకు వివరించి ఆరోగ్య నిర్వహణలో వాటి ప్రాముఖ్యతను వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.మధుసూదశెట్టి మాట్లాడుతూ ఔషధ గుణాలున్న మొక్కలను పకృతి మనకి ఇచ్చిన వరమని వాటిని భావితరాల కోసం కాపాడాలని, వాటి యొక్క ఔషధ గుణాలను విద్యార్థులు తెలుసుకొని రోగ నివారణలో ఉపయోగించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వివిధ రకాల ఔషధ మొక్కలను ప్రదర్శించి వాటి యొక్క ఔషధ గుణాలను వివరించారు.

టీడీపీ ప్రజల్లో పెరిగిన ఆదరణ

విశాలాంధ్ర -వెలుగోడు: శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు వెలుగోడు పట్టణ 108 బూత్ లోపాత బస్టాండ్ ఏరియాలో టిడిపి టౌన్ ప్రెసిడెంట్ ఖలీల్ ఖాన్ ఆధ్వర్యంలో సభ్యత నమోదు కార్యక్రమం సోమవారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలు స్వచ్ఛందంగా, ఉత్సాహంగా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని తమ పేర్లను సభ్యులుగా నమోదు చేసుకుంటున్నారు అన్నారు. లాయర్ సిద్దిక్ అహ్మద్, మిద్దె రెహమాన్, పోలూరు రెహమాన్, మౌలానా పాల్గొన్నారు.

గురురాజా విద్యార్థుల ప్రభంజనం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : గుంటూరు నగరం నంబూరు నందు వివిఐటి బాలోత్సవం 2024 నిర్వహించిన ప్రపంచ తెలుగు బాలల పండుగ పోటీలందు గురురాజా విద్యార్థులు ఏకంగా జాతీయ స్థాయిలో 50 బహుమతులు సాధించినట్లుగా స్కూల్ డైరెక్టర్ పి షేక్షావలిరెడ్డి తెలిపారు. జాతీయస్థాయి బాలోత్సవ్ కాంపిటీషన్ నందు ఏకంగా 850 పాఠశాలల నుండి 15వేల మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. రాష్ట్రంలో జాతీయ స్థాయి బాలోత్సవ్ లో అత్యధిక బహుమతులు సాధించిన ఏకైక పాఠశాల గురురాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్ అని బాలోత్సవం కన్వీనర్ శ్రీ వాసిరెడ్డి విద్యాసాగర్ గారు విద్యార్థుల అత్యద్భుతమని ప్రశంసించారు.

ఘనంగా భక్త కనకదాసు జయంతి వేడుకలు

విశాలాంధ్ర- కర్నూలు: జిల్లా కేంద్రంలోని బీసీ భవన్ నందు భక్త కనకదాసు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం జిల్లా పరిషత్ హాల్లో బీసీ వెల్ఫేర్ అధికారిణి వెంకట లక్ష్మమ్మ అధ్యక్షతన ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ రంజిత్ బాష పాల్గొన్నారు. ఆ కార్యక్రమంలో కురువ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిసె శివన్న మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లోశ్రీ భక్త కనకదాసు విగ్రహాలకు స్థలాలు కేటాయించి, కనకదాసు భవనాలు నిర్మాణానికి స్థలాలు కేటాయించాలన్నారు. జిల్లా కేంద్రంలోని కనకదాసు విగ్రహం ఏర్పాటుకు వై.జంక్షన్‌ను కనకదాసు జంక్షన్‌గా పేరు మార్చి అక్కడ విగ్రహం పెట్టేందుకు అనుమతి ఇవ్వాలన్నారు. గొర్రెలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని 90 శాతం సబ్సిడీపై గొర్రెల మేకలు ఇవ్వాలని రాష్ట్రంలోనే ప్రధాన దేవాలయాలైన తిరుపతి, శ్రీశైలం, అహోబిలం, విజయవాడ తదితర పుణ్యక్షేత్రాలలో కనకదాసు భవనాలు నిర్మించాలని కనకదా జయంతిని అధికారికంగా సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి దేవేంద్ర, కోశాధికారి జిల్లా కురువ సంఘం నాయకులు కేసీ నాగన్న, మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అనిత, కుంటనహల్ సర్పంచ్ శివరాం, బూదూర్ లక్ష్మన్న పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవలసిన అవసరం ఉంది

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: ప్రతిఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని రాయలసీమ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య ఎన్‌టికె నాయక్ పిలుపునిచ్చారు. ఎన్‌ఎస్‌ఎస్ వారి ఆధ్వర్యంలో కర్నూలు మెడికవర్ హాస్పటల్ వారి సౌజన్యంతో వర్సిటీ సెనేట్ హాలులో జరిగిన మెడికల్ క్యాంపును ఆయన ప్రారంభించారు. ఆరోగ్యమే మహాభాగ్యం అన్నమాట అక్షర సత్యమన్నారు. దేని విలువైనా పోగొట్టుకున్న తర్వాతే తెలుస్తుందన్నారు. కోవిడ్ తర్వాత ఏ అనారోగ్యం ఎప్పుడు చుట్టుముడుతుందో అర్థంకావడం లేదన్నారు. లక్షణాలు ఏ మాత్రం బయట పడకుండానే రకరకాల వ్యాధులు ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. కాబట్టి వయసుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉంటూ, తగినంత వ్యాయామంచేస్తూ ఆరోగ్యాన్ని కాపాడు కోవాలన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయ్ కుమార్ నాయుడు మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవలసినదిగా వర్సిటీ ఉద్యోగులకు, విద్యార్థులకు పిలుపునిచ్చారు. బిపి, షుగర్, ఈసిజి మొదలైన పరీక్షలు చేయించుకోవడం ద్వారా శరీరంలో జరుగుతున్న మార్పులను తెలుసుకొని తగుజాగ్రత్తలు తీసుకొనే అవకాశం ఉంటుందంటారు.

నాయకత్వ పెంపుపై శిక్షణ

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: నాయకత్వ పెంపుపై మండల విద్యాధికారులకు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఆరు రోజుల శిక్షణా కార్యక్రమం రాఘవేంద్ర బీఈడి కళాశాల నందు జరిగింది. కర్నూలు, కడప, నంద్యాల జిల్లాల నుండి హాజరైన మండల విద్యాధికారులకు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ అమరావతి వారి ఆదేశాల మేరకు ఆరు రోజుల నాయకత్వ లక్షణాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కడప రీజినల్ జాయింట్ డైరెక్టర్ కె.శామ్యూల్ ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో మూడు జిల్లాల నుండి వచ్చిన శిక్షణార్థులకు మొదటి రోజు శిక్షణ కార్యక్రమంలో ఆర్జెడి ప్రసంగిస్తూ ఈ కార్యక్రమం ద్వారా నాయకత్వ లక్షణాలను పెంపొందించుకొని విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి పాటుపడాలని ప్రధానో పాధ్యాయులు మంచి నాయకులను తమ పాఠశాలల్లోని విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు, విద్యార్థులను సమర్థవంతంగా తీర్చిదిద్ది వారిని మంచి పౌరులుగా దేశ అభివృద్ధి కి వారి భవితకు పునాదులు వేయాలని కోరారు మంచి మానవత్వ విలువలను, సహనాన్ని సోదర భావాన్ని పెంపొందించి సమాజ అభివృద్ధికి తోడ్పడాలని కోరడం జరిగింది.ఈ శిక్షణా కార్యక్రమంలో కల్లూరు మండల విద్యాధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ శిక్షణతో మండల విద్యాధికారులకు ప్రధాన ఉపాధ్యాయులకు ఎంతో మేలు చేకూరుతుందని తమ అభిప్రాయాన్ని వెల్లడించారు.

మున్సిపల్ కాంప్లెక్స్‌ను పరిశీలించిన కమిషనర్

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: స్థానిక వెంకటరమణ కాలనీలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ను నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు పరిశీలించారు. కొన్ని షాపులు ఖాళీగా ఉండటంపై ఆయన ఆరా తీశారు. నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, ఆర్‌ఓ జునైద్, సూపరింటెండెంట్ వాజిద్ పాల్గొన్నారు. ఆనంద్ థియేటర్ సమీపంలో కేసీ కెనాల్ వంతెన వద్ద నూతనంగా నిర్మిస్తున్న సీసీ డ్రైన్‌ను నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు పరిశీలించారు. వంతెన కింద లీకేజీ కారణంగా అవుతున్న నీటి నిల్వ ఉండకుండా, ఆ నీరును నూతన డ్రైనేజీలోకి మళ్లించాలని సూచించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. డిఈఈ క్రిష్ణలత, ట్రైనీ ఏఈ ప్రవీణ్, శానిటేషన్ ఇంస్పెక్టర్ వలి పాల్గొన్నారు.

ఘనంగా కార్తీకమాస లక్షదీపోత్సవం

విశాలాంధ్ర - హొళగుంద: హొళగుంద సిద్దేశ్వర స్వామి ఆలయంలో సోమవారం కార్తీక మాస లక్ష దీపోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆలయ ధర్మకర్త రాజా పంపాన గౌడ్ ఆధ్వర్యంలో స్వామివారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, మంగళ హారతి కార్యక్రమాలు జరిగాయి. భక్తులకు పూజారి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. సిద్దేశ్వర స్వామి ఆలయం, ఆవరణం ముందు స్వస్తిక్, ఓం, శివలింగ ఆకారం, దీపం ఆకారంలో మహిళా భక్తులు దీపాలను వెలిగించారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ ధర్మకర్త రా జా పంపన గౌడ మాట్లాడుతూ కార్తీక మాసం ఎంతో పవిత్రమై ందని శ్రేష్టమైందని అన్నారు అందువల్ల ప్రజలు ఆధ్యాత్మిక చింతనతో మెలగాలని కార్తీకమాసం దీపాలను వెలిగిస్తే ఎంతో పుణ్య ప్రాప్తిసిద్దిస్తుందని అన్నారు. లక్ష దీపోత్సవ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సిద్దార్థ గౌడ, శివ శంకర గౌడ, రేవన సిద్ధన గౌడ, అమరప్ప గౌడ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ నటుడు జూనియర్ ఎన్టీఆర్

విశాలాంధ్ర - ఆదోని క్రైమ్: సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ దేశం గర్వించదగ్గ నటుడని ఏపీ జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ రాష్ట్ర కన్వీనర్ ముజీబ్ అహ్మద్, కర్ణాటక ఎన్టీఆర్ ఫ్యాన్స్ రాష్ట్ర కన్వీనర్ బసవరాజు పేర్కొన్నారు. సోమవారం స్థానిక సత్యం- శివం కాంప్లెక్స్ లో దేవర అర్థ శత దినోత్సవ వేడుకలను ఇంటర్ సేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముజీబ్ అహ్మద్ మాట్లాడుతూ ఆదోని టౌన్ లో సోలో హీరోగా వచ్చిన దేవర సినిమా 48 రోజుల్లో కోటి రూపాయలు పైగా గ్రాస్ వసూలు చేసిన ఏకైక హీరో జూనియర్ ఎన్టీఆర్ అని అన్నారు. దేవర సినిమా ఎన్టీఆర్ అభిమానులు కాలర్ ఎగరేసుకొనే విధంగా దాదాపు ప్రపంచవ్యాప్తంగా 600 కోట్లు వసూలు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ తిమ్మప్ప, కళ్యాణ్ రామ్ ఫ్యాన్స్ గొనబావి గోపాల్, జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ చాంద్ బాషా, నాగరాజు, మోహన్ పాల్గొన్నారు.

లక్ష దీపోత్సవం -పుష్కర్ణి హారతి

విశాలాంధ్ర - శ్రీశైలం: శ్రీశైల మహా క్షేత్రంలో కార్తీకమాస మూడో సోమవారాన్ని పురస్కరించుకొని ఆలయ దక్షిణ భాగంలో గల పుష్కరణ వద్ద లక్ష దీపోత్సవం పుష్కరణ హారతి కార్యక్రమాన్ని ఆలయ అర్చక స్వాములు సాంప్రదాయకంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేక పూజలు నిర్వహించి వివిధ ఆకృతులతో అలంకరించిన దీపాలను భక్తులచే వెలిగింప చేయించారు. పుష్కర్ణి వద్ద దశ హారతులు ఇచ్చి పుష్కరిణి హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ విశేష కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చక, వేద పండితులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాతాళ గంగలో పుణ్యస్నానాలు ఆచరించి, స్వామి అమ్మవారి దర్శనానికి క్యూ లైన్‌లో వేచి ఉన్నారు. భక్తులు కార్తీకదీపం వెలిగించుకునేందుకు దేవస్థాన అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కురువలు అన్ని రంగాల్లో రాణించాలి

విశాలాంధ్ర - హొళగుంద: కురువలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు కురువ బుజ్జమ్మ కోరారు. కోకిల తోటలో భక్త కనకదాసుడి 537వ జయంతిని సోమవారం ఘనంగా ఆచరించారు. కనకదాసుడి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా పూజలు చేశారు. జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు కురువ బుజ్జమ్మ మాట్లాడుతూ కనకదాసుడు భక్తి మార్గంలో ఉంటూ ఎన్నో గేయాలను పాడుతూ, పుస్తకాలను రచించి సామాజిక మార్పు తెచ్చాడని కొనియాడారు. ప్రజలందరూ కనకదాసుడి తత్వ సిద్ధాంతాన్ని అనుసరించి నడవాలని కురువలు పిల్లలను బాగా చదివించాలని ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధి చెందాలని విజ్ఞప్తి చేశారు. ఏశుభకార్యాలు జరిగిన కురువ కులస్తులను పూజ కోసం ప్రజలు గెలిపించి బోనగి వ్యాపారం చేస్తారని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ కురువ కులస్తులను గౌరవించి ఎంపి, ఎమ్మెల్యే తో పాటు ఎమ్మెల్ సీ స్థానిక సంస్థల ఎన్నికల్లో గుర్తించి అధికారం కట్టబెట్టారని కొనియాడారు. కార్యక్రమంలో కురువ సంగం నాయకులు కురువ శేషప్ప, ఉచ్చన్న, ఆలు తాలూకా మాదాసి కురువ సంఘం కార్యదర్శి పెద్దహేట మల్లయ్య తదితరులు పాల్గొన్నారు